## క్లుప్తంగా

### వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎల్లారెడ్డిపేట మైనార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మదీయ మజీద్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ షాదుల్, నాయకులు అలీ, ఖాజా మొహినొద్దీన్, బాబా తదితరులున్నారు.

### నేడు కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ఆరోవార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజం తన అనుచరులతో గురువారం కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. నెహ్రూనగర్‌లో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ఎల్లారెడ్డిపేట సీఐగా శ్రీనివాస్

- సీఐ శశిధర్‌రెడ్డి బదిలీ



శ్రీనివాస్, సీఐ

సిరిసిల్లక్రైం/ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్ మందమర్రి సర్కిల్‌కు బదిలీ అయ్యారు. అలాగే, భూపాలపల్లిలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పని చేస్తున్న బాలుసాని శ్రీనివాస్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

### ఉపన్యాస పోటీలో ప్రతిభ



సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఇటీవల తెలంగాణ సాంకేతిక విద్యామండలి, పర్యావరణ పరిరక్షణ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో సుస్థిర భవిష్యత్తు కోసం వైజ్ఞాన శాస్త్రం అనే అంశంపై ఉపన్యాసం, కవితలు, చిత్రలేఖనం, పాటల పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహించారు. హన్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని బూర తపస్వి ఎలక్ట్రానిక్ వ్యర్థాలు–నియంత్రణ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చి, రాష్ట్రస్థాయి బహుమతి సాధించింది. బుధవారం హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ బహుమతి అందజేశారు.

### 'కందేపి'కి సబల సత్యభామ పురస్కారం ప్రదానం

సిరిసిల్లటౌన్: బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌కు మరో రాష్ట్రస్థాయి పురస్కారం దక్కింది. హైదరాబాద్‌కు చెందిన గోనె వెంకటేశ్వర్ సేవా సంస్థవారు సాహితీ రంగంలో విశేష కృషి చేస్తున్న ఆమెకు బుధవారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక, ప్రవచన వేత్త అనంతలక్ష్మి చేతులమీదుగా సబల సత్యభామ పురస్కారం అందజేశారు.

### క్రికెట్ కప్ అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేత తంగళ్లపల్లి జట్టుకు క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి బుధవారం కప్‌తో పాటు రూ.16 వేల నగదు బహుమతి అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని తదితరులు పాల్గొన్నారు.

### టీబీ విముక్త్ గ్రామంగా ప్రకటనకు సిఫారసు

బోయినపల్లి: నర్సింగాపూర్‌ను టీబీ విముక్త్ గ్రామంగా ప్రకటించడం కోసం సిఫారస్ చేసినట్లు విలాసాగర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి అనిత బుధవారం తెలిపారు. గ్రామంలో గతేడాది 65 మందికి తెమడ పరీక్షలు చేస్తే ఒక్కరికే టీబీ నిర్ధారణ అయిందన్నారు.

### పల్స్ పోలియో విజయవంతం చేయాలి

బోయినపల్లి: మండలంలో వచ్చే నెలలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ కోరారు. బుధవారం తన కార్యాలయంలో బోయినపల్లి, కొదురుపాక, విలాసాగర్, కొదురుపాక పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌కు చెందిన నిమ్మల రాజు గల్ఫ్‌లో గుండెపోటుతో మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య బుధవారం పరామర్శించారు. కన్నడ సినిమా డైరెక్టర్ చిదుగు రవిగౌడ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోగా కుటుంబసభ్యులను ఓదార్చారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



దమ్మన్నపేట స్కూల్లో సైన్స్ ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్..



వేములవాడ: వివిధ పరికరాలతో విద్యార్థినులు..



ఎల్లారెడ్డిపేటలో ఎగ్జిబిట్స్ ప్రదర్శన..



ఓబులాపూర్‌లో..

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

గంభీరావుపేట: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లా బుధవారం ఘనంగా నిర్వహించారు. గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రారంభించారు. విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకొని, అభినందించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజు, మాజీ సర్పంచ్ బాల్యా నాయక్, ప్రధానోపాధ్యాయులు ఎర్ర సత్యనారాయణ, సంపత్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల, జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలల్లో, అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పరికరాలను తయారు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు, ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని, కిషన్‌దాస్‌పేట ఎంపీపీఎస్ పాఠశాలల్లో బుధవారం సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయులు రజిత, కుబేరస్వామి, ఉపాధ్యాయులు మనోహరాచారి, హన్మాండు వారిని అభినందించారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సర్ సి.వి.రామన్ రామన్ ఎఫెక్ట్‌ని ఆవిష్కరించిన రోజును పురస్కరించుకొని జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రతీ విద్యార్థి సైన్స్‌పై అభిమానం పెంచుకోవాలని, నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారాలు కనుక్కోవడంలో శాస్త్రవేత్తలను మార్గదర్శకులుగా భావించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వేసిన సైన్స్ ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాజెక్టులు తయారు చేసి, ప్రదర్శించారు. సైన్స్ క్విజ్ పోటీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు శారద, కవిత, గణేశ్, విశ్వనాథ్, సువర్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు రంగంపేట యూపీఎస్‌లో విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేసి, వాటి ఉపయోగాలను వివరించారు. అనంతరం మూఢనమ్మకాలపై నాటిక ప్రదర్శించారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, ప్రవీణ్, ఉపాధ్యాయులు రవి, మానస, దివ్య, సుజాత తదితరులున్నారు.

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించి, ప్రదర్శించారు. ప్రాథమిక పాఠశాల నెహ్రూనగర్, గోపాల్‌నగర్ విద్యార్థులు సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, ఉపాధ్యాయులు లచ్చయ్య, పరమేశ్, రాజశేఖర్, భారతి, సలావుద్దీన్, కీర్తి, సువర్ణ, రజిత రాధాకిషన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి**

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఎస్సార్‌ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, సైన్స్‌ను నమ్మాలని, ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు మోతీలాల్, స్టాఫ్ సెక్రటరీ పురుషోత్తం, ఉపాధ్యాయులు ఉన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, విలాసాగర్ హైస్కూల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సి.వి.రామన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. విలాసాగర్ హైస్కూల్లో టేలర్స్ డే జరిపారు. పదోతరగతి విద్యార్థి వినయ్, తదితరులు వేసిన చిత్రాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, హెచ్‌ఎం శ్రీనివాస్, టీచర్లు ఉన్నారు.



విలాసాగర్ హైస్కూల్లో విద్యార్థులు వేసిన చిత్రాలు



ఆవునూర్ పాఠశాలలో..



వీర్నపల్లి హైస్కూల్లో..



సిరిసిల్ల ఉన్నత పాఠశాలలో..

# ఇది ప్రజాప్రభుత్వం.. అందరూ కలిసిరండి

- మంత్రి పొన్నం ప్రభాకర్



కౌన్సిలర్ ఉమారాణి–శ్రీనివాస్ దంపతులకు కండువా కప్పుతున్న మంత్రి పొన్నం, విప్ శ్రీనివాస్

వేములవాడ: ఇది ప్రజాప్రభుత్వమని.. అందరూ కలిసిరావాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. వేములవాడ పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్ అన్నారం ఉమారాణి–శ్రీనివాస్ దంపతులు బుధవారం కాంగ్రెస్‌లో చేరగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వారు కండువా కప్పారు. కౌన్సిలర్ ఉమారాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి, పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

**చేనేత కార్మికులను ఆదుకోవాలి**

చేనేత కార్మికులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు కదారి రాములు, అజ్జ వేణు కోరారు. బతుకమ్మ చీరల పేరుతో వారికి పని లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు.

**ప్రత్యేక విద్య టీచర్లకు ప్రమోషన్ ఇవ్వాలి**

వేములవాడరూరల్: కొన్నేళ్లుగా సమగ్ర శిక్ష ప్రత్యేక విద్య అందిస్తున్న టీచర్లకు ప్రమోషన్ ఇవ్వాలని వేములవాడ భవిత సెంటర్ నిర్వాహకురాలు జయలక్ష్మి కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ఆ వినతిపత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారని పేర్కొన్నారు.

# ఎంపీ సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేములవాడ తెలంగాణ చౌక్‌లో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: బీజేపీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఎంపీ సంజయ్‌పై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి, నాయకులు కైలాశ్, నరేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: ఎంపీ సంజయ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు తగులబెట్టడాన్ని నిరసిస్తూ నూకలమర్రి గ్రామంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రవికిశోర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులున్నారు.

వేములవాడ: ఎంపీ సంజయ్‌పై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు వేములవాడ తెలంగాణ చౌక్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పిన్నింటి హన్మాండ్లు, నాయకులు వివేకరెడ్డి, మనోజ్ తదితరులున్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంలో ఎంపీ సంజయ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఆయనపై కాంగ్రెస్ నాయకుల అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్, నాయకులు రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, గిరి, మహేందర్, సంతోష్‌రెడ్డి, గోపి తదితరులున్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ అధ్యక్షుడు మల్లేశం, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు ప్రకాశ్, నాయకులున్నారు.

# గ్యారంటీల అమలుపై సంబరాలు



సిరిసిల్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ప్రకటనపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం సిరిసిల్ల గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, నాయకులు సంగీతం శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, సూర దేవరాజు, కాముని వనిత, వెల్ముల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ పథకాల ప్రకటనపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్కే గౌస్, లింగంగౌడ్, రాజేందర్, రాములు, ఆకుల లత, బుర్క జ్యోతి పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు బుధవారం ముస్తాబాద్‌లో క్షీరాభిషేకం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు అమలు చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, పట్టణశాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

### అలరించిన వీడ్కోలు వేడుక



ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. హెచ్‌ఎం రాధాకిషన్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.

### ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాల ఉపాధిహామీ సిబ్బందితో డీఆర్డీవో శేషాద్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల్లో కూలీల హాజరు, 100 రోజుల ఉపాధి కల్పన, ఆధార్ అనుసంధానం, తెలంగాణకు హరితహారం కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఏపీడీ నర్సింలు, ఏపీవోలు, ఈసీలు, జేఈలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి: రాళ్లపేట తుర్కాశి కాలనీ, మండెపల్లిలో సీసీరోడ్లు, ఎల్లమ్మ ఆలయం వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని బుధవారం భూమిపూజ చేశారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని 16వ వార్డులో సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం భూమిపూజ చేశారు.

# కేటీఆర్ కప్ ట్రోఫీల ప్రదానం



ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

సిరిసిల్లటౌన్: కేటీఆర్ కప్ ఆఫ్ క్రికెట్ పోటీలు గత నెలలో మదీన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో జరిగాయి. విజేతగా సిరిసిల్లకు చెందిన వారియర్స్ టీం, రన్నరప్‌గా సీవోసీ–11 జట్లు నిలిచాయి. వాటికి ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ట్రోఫీలు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టోర్నీ నిర్వాహకులు సయ్యద్ ఉస్మాన్, సయ్యద్ అక్రం, షఫీ, అలీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాప్రతినిధులతో సరదాగా..**

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కేటీఆర్ స్థానిక ప్రజాప్రతినిధులతో బుధవారం సరదాగా గడిపారు. జెడ్పీటీసీ సభ్యుడు చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు కొండ ఆంజనేయులుగౌడ్, గుల్లపల్లి నర్సింహారెడ్డి, రాగం ఎల్లయ్య తదితరులున్నారు.

# ఎంపీ సంజయ్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చేర్ల పద్మ



మాట్లాడుతున్న పద్మ

సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చేర్ల పద్మ అన్నారు. బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీ వ్యాఖ్యలు యావత్ మహిళా లోకాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. బీజేపీ నేతలు రాముని పేరు చెప్పుకుని, ఓట్లు దండుకోవడం సరికాదన్నారు. ఎంపీ వెంటనే మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, సానియా తదితరులు పాల్గొన్నారు.

# తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



రుద్రంగి: పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

చందుర్తి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 71 మందికిగానూ 69 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మల్లేశ్ తెలిపారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీతో కలిపి 87 మంది విద్యార్థులకు గానూ 82 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ లింగయ్య తెలిపారు.

కోనరావుపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 326 మంది విద్యార్థులకు గానూ 318 మంది పరీక్ష రాశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### టైలర్స్ డే

గంభీరావుపేట/బోయినపల్లి: మండల కేంద్రాల్లో బుధవారం టైలర్స్ డే నిర్వహించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. టేలర్స్ అసోసియేషన్ బోయినపల్లి మండల నాయకులు నర్సయ్య, శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం టైలర్స్‌కు ఉచిత విద్యుత్, సబ్సిడీ రుణాలు, 50 ఏళ్లు నిండిన దర్జీలకు పింఛన్ ఇవ్వాలని కోరారు.

# పంచాయితీ పేరిట డబ్బులు వసూలు

- ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం: పంచాయితీలు చేస్తామంటూ వసూళ్లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ హెచ్చరించారు. మధ్యవర్తిత్వం పేరిట డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, బుధవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన లకావత్ శ్రీరామ్‌పై అదే గ్రామానికి చెందిన ఓ బాలికను వేధించిన ఘటనలో ముస్తాబాద్ ఠాణాలో 2019లో పోక్సో కేసు నమోదైందన్నారు. ఇది కోర్టులో పెండింగ్ ఉన్నందున లకావత్ చిన్న మున్నా అలియాస్ మున్నా నాయక్ రాజీ కుదిర్చేందుకు పంచాయితీ చేస్తానన్నాడని తెలిపారు. ఇందుకోసం శ్రీరామ్‌ను రూ.1.80 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఇచ్చాడన్నారు. తర్వాత పంచాయితీ చేయకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు మున్నానాయక్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత?

చందుర్తి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం అర్ధరాత్రి ఆశిరెడ్డిపల్లె శివారులో పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. అది గ్రామానికే చెందిన ఓ నాయకునిదని, పోలీసులు వివరాలు చెప్పడంలేదని ప్రచారం జరుగుతోంది. ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా వేరే పనిలో ఉన్నానని తెలిపారు.

# పంటలకు మద్దతు ధర కల్పించాలి



దీక్షలో ఎల్లారెడ్డిపేట నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా బుధవారం హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన దీక్షలో ఎల్లారెడ్డిపేట కిసాన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా గతంలో ఉద్యమించిన రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి వంగ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు మానుక సతీశ్, వట్టెల శేఖర్ తదితరులున్నారు.